క్లుప్తంగా

రైతులు నానో యూరియాను వినియోగించాలి



రైతులకు సూచనలు చేస్తున్న ఏవో గిరిబాబు

గూడెంకొత్తవీధి: యూరియాకు బదులుగా నానో యూరియాను రైతులు వినియోగించాలని వ్యవసాయాధికారి గిరిబాబు సూచించారు. సంకాడ,కోట్నిపల్లిలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ఆకుముడత పురుగు నివారణకు కార్డప్ హైడ్రో క్లోరైడ్ 50 ఎస్‌పీ పౌడర్‌ను పిచికారీ చేయాలని తెలిపారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ జానకమ్మ

దుంబ్రిగుడ: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జెడ్పీటీసీ చటారి జానకమ్మ అన్నారు. మండలంలోని అరకు పంచాయతీ నేరేడువలస అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు.గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం పూర్తి స్థాయిలో అందించేందుకు కుటుంబ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు లక్ష్మి, స్వర్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొడ్డగొందిలో..

ముంచంగిపుట్టు: మండలంలో జర్రెల పంచాయతీ బొడ్డగొంది అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు జరిపారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు.గర్భిణులు ప్రసవాలు ఆస్పత్రిలోనే చేసుకోవాలని,ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు దేవకి, మల్లీశ్వరి, సరోజిని, శ్రీదేవి,శాంతి, భానుప్రియ, అచ్చమ్మ, లక్ష్మి, మహిళ పోలీసు లావణ్యలు పాల్గొన్నారు.



వారోత్సవాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

రహదారిపై భారీ గొయ్యి

- వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు



బూరుగుచెట్టు గ్రామ ప్రధాన రహదారిలో గోతిలో నిలిచిన వరదనీరు

పాడేరు రూరల్: మండలంలో సలుగు పంచాయతీ బూరుగుచెట్టు గ్రామ ప్రధాన రహదారిలో పెద్ద గొయ్యి ఏర్పడడంతో వర్షంనీరు చేరి చెరువును తలపిస్తోంది. దీంతో ఈమార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహనాదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. అంబులెన్స్‌లు రాకపోకలు సాగించేందుకు కష్టతరంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి గోయ్యను పూడ్చి ప్రజలకు, వాహనాదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పని గంటల పెంపును ఉపసంహరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

రాజవొమ్మంగి : పనిగంటల పెంపును ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ రాజవొమ్మంగిలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం ఆందోళన చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని, పెంచిన పని గంటల పెంపు విధానాన్ని ఉపసంహరించాలని కోరారు. సీఐటీయూ నాయకుడు పుట్టా రామరాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం మృతి



రూపవతి(ఫైల్)

జి.మాడుగుల: మండలంలో నుర్మతి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో గ్రేడ్–1 ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రూపవతి అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో మృతి చెందారు. పాఠశాలకు దసరా సెలవులు ఇవ్వడంతో పాడేరు మండలంలో తమ స్వగ్రామానికి వెళ్లారు. అక్కడ ఆమె అస్వస్థతకు గురికావడంతో పాడేరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

అన్నవరంలో దాహం కేకలు

- మూలకు చేరిన తాగునీటి బోర్లు
- అలంకార ప్రాయంగా కుళాయిలు
- పట్టించుకోని అధికారులు



అలంకార ప్రాయంగా ఉన్న కుళాయి



మరమ్మతులకు నోచుకోని బోరు



గ్రామస్తుల దాహం తీర్చని మంచినీటి పథకం



ఊటగెడ్డ నుంచి నీటిని మోసుకువస్తున్న మహిళ



ఊటగెడ్డ వద్ద నీరు సేకరిస్తున్న మహిళలు

చింతపల్లి: పంచాయతీ కేంద్రం అన్నవరంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. గుక్కెడు నీటికోసం స్థానికులు అష్టకష్టాలు పడుతున్నారు. మెయిన్‌రోడ్డువీధి, మోహన్‌రావు వీధి, చేతుడువీధిలలో 150 కుటుంబాలకు చెందిన ఆరువందల మందికిపైగా నివసిస్తున్నారు. గతంలో స్థానికంగా పాఠశాల కొండపై ఏర్పాటు చేసిన మంచినీటి పథకం ద్వారా ఈ మూడు వీధులతో పాటు కుమ్మరివీధికి తాగునీరు సరఫరా చేసేవారు. ఏడాది కాలంగా ఈ పథకం ద్వారా కుమ్మరివీధికి మినహా మిగతా వీధులకు చుక్కనీరు సరఫరా కావడం లేదు. ఈ మూడువీధులకు తాగునీరు సరఫరా కాకపోవడంతో స్థానికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ఈ వీధుల్లో ఉన్న ఐదు బోర్లలో నాలుగు బోర్లు మూలకు చేరాయి. గ్రామంలో ఇంటింటికీ ఏర్పాటు చేసిన కుళాయిలు నిరుపయోగంగా దర్శినమిస్తున్నాయి.రోడ్డువీధి వాసులు తాగునీటిని కొనుగోలు చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. మోహన్‌రావు వీధిలో ఉన్న ఒక్క బోరు మరమ్మతులతో మూలకు చేరింది. దీంతో ఈ వీధి వాసులు కిలో మీటరు దూరంలో ఉన్న కొండ ఊటగెడ్డ నుంచి తాగునీటిని సేకరించి, మోసుకు రావలసిన పరిస్థితి ఏర్పడింది. 30 అడుగుల లోతునుంచి అధ్వానంగా ఉన్న మార్గంలో నీటిని తీసుకురావలసి వస్తోందని ఆ వీధి వాసులు వాపోయారు. చేతుడువీధిలో ఒక్క బోరు కూడా లేకపోవడంతో 80 ఆదివాసీ గిరిజన కుటుంబాల వారు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ వీధి వాసులు పురాతన బావిలో బురదనీటినే తాగునీటిగా వినియోగించవలసి వస్తోంది. జల్‌జీవన్ మిషన్‌ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు బోరు ఏర్పాటు చేసి ఏడాది కావస్తున్నా పథకం వినియోగంలోకి రాలేదు. పలుమార్లు పంచాయతీ,మండల స్థాయి అధికారుల దృష్టికి తాగునీటి సమస్యను తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పంచాయతీ కేంద్రంలో ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

కిలోమీటరు నడిస్తేనే తాగునీరు



వీధిలో ఉన్న ఒక్క బోరు మరమ్మతులకు గురై మూలకు చేరింది. దీంతో కిలో మీటరు దూరంలో ఉన్న కొండ ఊటగెడ్డ నుంచి సేకరించిన నీటికి తీసుకువస్తున్నాం.చినుకు పడితే ఆ ఊటగెడ్డకు వెళ్లలేని పరిస్థితి. ఊటగెడ్డ నుంచి నీరు తీసుకు రావడానికి రోజూ సాహసం చేయాల్సివస్తోంది.

– సేవా లీలావతి,మోహన్‌రావు వీధి,అన్నవరం

అలంకారప్రాయంగా కుళాయిలు



మెయిన్‌రోడ్డు వీధిలో ఏర్పాటు చేసిన కుళాయిలు అలంకార ప్రాయంగా మిగిలాయి. తాగునీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మంచినీటి పథకం ఉన్నా నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి రక్షిత పథకం నుంచి కుళాయిల ద్వారా నీరు సరఫరా చేయాలి.

– అరుకు లక్ష్మి రోడ్డువీధి, అన్నవరం

బురదనీరు తాగుతున్నాం



మా వీధిలో 80 కుటుంబాలు నివాసముంటున్నాయి. పురాతన బావిలో బురద నీటినే తాగునీటిగా వినియోగిస్తున్నాం. మా వీధిలో కనీసం ఒక్క బోరు కూడా లేకపోవడంతో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నాం. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది.ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి

– వంతల రాజు, చేతుడు వీధి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న కౌన్సెలర్ వాసు

అడ్డతీగల: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీహెచ్‌సీ కౌన్సెలర్ నారే వాసు అన్నారు. మండలంలో వివిధ ప్రాంతాల నుంచి సీహెచ్‌సీకి వచ్చిన రోగులు,ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. జ్వరం,డయేరియా,మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అనారోగ్యం సోకినవెంటనే ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందాలని తెలిపారు. యువత గంజాయి,గుట్కా,పొగాకు, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



104 రీజనల్ మేనేజర్ లక్ష్మణరావుతో డాక్టర్ పావని, ఇతర సిబ్బంది

రాజవొమ్మంగి: 104 వాహన సిబ్బంది రోగులకు మెరుగైన సేవలందించాలని రీజినల్ మేనేజర్ అల్లం లక్ష్మణరావు సూచించారు. మండలంలోని జడ్డంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 104 అంబులెన్స్ సేవలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 104 డీఈవో శ్రీనివాస్, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.పావని, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఏఎన్‌ఎం వి. నూకరత్నం, లక్ష్మి, పైలెట్ కనకరాజు సిబ్బంది పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలి



గానుగులలో ప్రాజెక్ట్ నిర్మించే ప్రాంతానికి వెళ్తున్న సీపీఎం నేతల బృందం



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర



మాట్లాడుతున్న సర్పంచ్ సునీత

కొయ్యూరు: హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ చేపట్టిన జీపు జాతా పవర్ ప్రాజెక్ట్ నిర్మించనున్న గానుగులకు మంగళవారం చేరింది. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో అప్పలనర్స మాట్లాడుతూ ఆదివాసీల జీవితాలను నాశనం చేసే ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐదు ప్రతిపాదిత ప్రాజెక్ట్‌లకు పదివేల ఎకరాల మేరకు భూ సేకరణ జరుగుతుందన్నారు. దీని వల్ల అడవిపై ఆధారపడిన వందలాది మంది గిరిజనులు ఉపాధి కోల్పోతారని, పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని తెలిపారు. జీవ వైవిధ్యం నాశనమవుతుందని చెప్పారు. అనంతరం తులబాలగెడ్డలో సభను నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొర్రా త్రినాథ్, జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్న పడాల్, కమిటీ సభ్యులు సింహాద్రి,బాబూరావు, సీపీఎం కొయ్యూరు కార్యదర్శి సూరిబాబు పాల్గొన్నారు.

హుకుంపేట: హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలు వెనక్కి తీసుకోవాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మజ్జివలస పంచాయతీలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు తాపుల కృష్ణారావు, గిరిజన మహిళ సంఘం నాయకురాలు హైమవతి, ప్రాజెక్టు వ్యతిరేక పోరాటకమిటీ కన్వీనర్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీవో నంబర్ 51ని రద్దు చేయాలి

దుంబ్రిగుడ: గిరిజన ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం జారీ చేసిన జీవో నంబర్ 51ని తక్షణమే రద్దు చేయాలని సీపీఎం నాయకురాలు, గసభ సర్పంచ్ పాంగి సునీత డిమాండ్ చేశారు. గసభలోని గిరిజనులతో ఆమె మాట్లాడుతూ నవయుగ, అదానీ కంపెనీలతో కూటమి ప్రభుత్వం జిల్లాలో 30 కేంద్రాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఒప్పందాలు చేసుకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన హక్కులు, చట్టాలు కాలరాస్తోందని విమర్శించారు. జీవో నంబర్ 51ని రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో గసభ మాజీ సర్పంచ్ పాంగి సురేష్, వార్డు సభ్యులు సత్యనారాయణ, రాజ్‌కుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అరణ్య గర్జన సభను విజయవంతం చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బాలదేవ్

అరకులోయటౌన్: హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ మజ్జివలసలో హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ నిర్వహించనున్న అరణ్య గర్జన సభను విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని, జీవో నంబర్ 13, 51 లను తక్షణమే రద్దు డిమాండ్ చేశారు. అరణ్య గర్జన కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని, ప్రభుత్వ నిర్ణయం మార్చుకునే వరకు పోరాటం చేయాలన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ బస్కీ పంచాయతీ కన్వీనర్ బురిడి దశరథ్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పోరాట కమిటీ నాయకుడు నాగేశ్వరరావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి గతం బుజ్జిబాబు, నాయకులు కిల్లో జగన్నాథం, సహదేవ్, ముకుంద, కాఫీ రైతు సంఘం మండల కార్యదర్శి సీహెచ్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ కళావతి, ఎంపీటీసీ రాములమ్మ

అరకులోయటౌన్: మండలంలోని లోతేరు పంచాయతీ కాగువలస జంక్షన్ నుంచి ముసిరిగుడ వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ గుబాయి కళావతి, ఎంపీటీసీ సమర్ది రాములమ్మ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎం జన్‌మన్ పథకం కింద పీవీటీజీల గ్రామానికి రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. సకాలంలో నాణ్యతతో రహదారి నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములు, కిల్లో నాబో, మాజీ సర్పంచ్ జర్రా రఘునాథ్, వార్డు సభ్యులు కొర్రా సుబ్బారావు, జర్రా అప్పలస్వామి, గుబ్బాయి జగన్నాథం, పీసా కమిటీ సభ్యులు కొర్రా స్వామి, కిల్లో భీమ, వైఎస్సార్‌సీపీ నాయకులు కిల్లో త్రినాథ్, గుబ్బాయి వెంకటరావు, పాంగి నాయుడు, కొర్రా రాంబాబు, బాబురావు, వెంకటరావు, మంగ్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్లివరం-సప్పిపుట్టు రహదారిలో తుప్పల తొలగింపు



సప్పిపుట్టులో జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్న స్థానికులు



చినరెల్లంగిపాడు కాలనీలో మొక్కలను తొలగిస్తున్న గ్రామస్తులు

పాడేరు రూరల్: మండలంలో వంతాడపల్లి పంచాయతీ అల్లివరం,సప్పిపుట్టు గ్రామ రహదారిలో మంగళవారం జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు. రోడ్డుకిరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ప్రమాదలు చోటుచేసుకున్నాయి. దీంతో పంచాయతీ అధికారులు జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహించారు.

రాజవొమ్మంగి : మండలంలోని చినరెల్లంగిపాడు, చినరెల్లంగిపాడు కాలనీల్లోని వీధుల్లో పిచ్చిమొక్కలు, పొదలు, చెత్తను మంగళవారం శ్రమదానంతో తొలగించారు. పొదల కారణంగా గ్రామంలో అపరిశుభ్రవాతావరణం నెలకొందని, పిల్లలు, గర్భిణులు రోగాల బారిన పడుతున్నారని స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి, గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మెకానిక్ షాపులో చోరీ



చోరీ చేస్తున్న నిందితుడు (సీసీ కెమెరా చిత్రం)

సీలేరు: మండలంలోని దారకొండ గ్రామంలో ఒక మెకానిక్ షాపులో సామగ్రిని ఓ వ్యక్తి చోరీ చేయగా, అదే రోజు రాత్రి మరో మెకానిక్ షాపులో చోరీకి యత్నించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దబ్బకోట మాయాబజార్ జంక్షన్ వద్ద ఉన్న కాళిదాసు మెకానిక్ షాపులో రెంచీలు, హోమ్ థియేటర్, విలువైన మిషన్లను చోరీ చేశాడు. షాపులో ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశాడు. వీటి విలువ రూ. 30 వేలు ఉంటుందని మెకానిక్ కాళిదాసు తెలిపారు. దారకొండ మెయిన్ బజార్‌లో గల కృష్ణ బైక్ మెకానిక్ షాపులో చోరీకి దొంగలు యత్నించారు. అప్పటికే మెలుకువగా ఉన్న కృష్ణ కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వరప్రసాద్



చింతపల్లి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున

సీలేరు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ వరప్రసాద్ తెలిపారు. స్థానికంగా కొంతమంది యువకులకు మంగళవారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. గంజాయి సేవిస్తూ గ్రామస్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వెంటనే ఆ అలవాటును మానుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు పంచాయతీల్లో గంజాయికి అలవాటు పడిన యువతకు ప్రతివారం కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. గంజాయి సరఫరా చేసిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రవీంద్ర పాల్గొన్నారు.

చింతపల్లి: మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ డి.నాగార్జున తెలిపారు. దీనిపై విద్యార్థులు గ్రామీణుల్లో చైతన్యం కల్పించాలని చెప్పారు. స్థానిక జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల జరిగే అనార్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు,అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు

సింగంపల్లిలో రెండు బోర్ల ఏర్పాటు



బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ శుభలక్ష్మి

రాజవొమ్మంగి : మండలంలోని తంటికొండ పంచాయతీ సింగంపల్లిలో రెండు బోర్లను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి తెలిపారు. ఒకటి అంగన్‌వాడీ కేంద్రం వద్ద, ఇంకోటి మరో వీధిలో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సింగంపల్లిలో బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ నిధులతో వట్టిగెడ్డలో డ్రైనేజీలో పూడిక తీత పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉప సర్పంచ్ పల్లి వెంకటరమణ, ఎంపీటీసీ నిర్మలాదేవి, పంచాయతీ సెక్రటరీ బాలురెడ్డి పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



చింతపల్లిలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ బాలయ్యపడాల్, డీసీహెచ్‌ఎస్ నీలవేణి

చింతపల్లి: మహిళలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యపడాల్ అన్నారు. మంగళవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ ప్రత్యేక వైద్యశిబిరాన్ని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.నీలవేణితో కలసి ప్రారంభించారు. ఈ శిబిరంలో 200 మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు జల్లి హలియారాణి, కవడం ఈశ్వరరావు, సాగిన దేవుడమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, వైద్యనిపుణులు చందన, ప్రభావతి, వాసవి, శ్రీలత, అనూష చంద్రశేఖర్, సాహితి, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, ఆఫీస్ సూపరింటెండెంట్ రాజారావు,లాబ్ అసిస్టెంట్ అనిల్ తదతరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: స్వస్త్‌నారీ సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా సొవ్వగ్రామంలో మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కిల్లోగుడ పీహెచ్‌సీ వైద్యాధికారి కుమార్‌రత్న 95 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఎంపీహెచ్‌ఈవో సంజీవ్‌రావు, హెచ్‌వి పుష్ప, హెల్త్ అసిస్టెంట్‌లు శెట్టి స్వామి, శెట్టి ప్రభాకర్, అప్పలరాజు పాల్గొన్నారు.

పెదబయలు: మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా స్వస్త్ నారి సశక్త్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పెదబయలు పీహెచ్‌సీ వైద్యాధికారి సత్యశ్రీ అన్నారు.మంగళవారం అరడకోటలో మహిళలకు వైద్య సేవలందించారు. వైస్ ఎంపీపీ కొర్రా రాజుబాబు, సర్పంచ్ రూడ మత్స్యలింగం, ఉప సర్పంచ్ బాలకృష్ణ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో చక్రధర్

రాజవొమ్మంగి: ప్రస్తుతం పిలకలు పెట్టేదశలో ఉన్న వరి పొలాల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి చక్రధర్ తెలిపారు. రాజవొమ్మంగికి సమీపంలోని విద్యానగర్‌లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. అధిక మోతాదులో రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించరాదని తెలిపారు. ప్రస్తుతం వరికి పొడతెగులు ఆశించినట్టు చెప్పారు. ఈ తెలుగు నివారణకు హెక్సాకొనాజోల్ 5శాతం ఈసీ మందును రెండు మిల్లీలీటర్ల నీటిలో కలిపి పైరు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. లేదా అజోక్సీస్ట్రోబిన్ అనే మందును కూడా ఇదే రీతిలో పిచికారీ చేసి ఈ తెగులును నివారించవచ్చని చెప్పారు.